క్లుప్తంగా

కనుల పండువగా పల్లకీ ఉత్సవం



అలంకరణలో షిర్డీసాయి

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో పల్లకీ ఉత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం ,అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు



బెళుగుప్పలో సర్వే చేస్తున్న ఐఈఆర్‌టీ లక్ష్మీనారాయణరెడ్డి

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో శారీరక మానసిక దివ్యాంగుల పిల్లలను గుర్తిస్తూ ఐఈ ఆర్‌టీలతో సర్వే చేపట్టామని ఎంఈఓ–1 మల్లారెడ్డి, ఎంఈఓ–2 హరికృష్ణ గురువారం తెలిపారు. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోనూ ఐఈఆర్‌టీలు అశోక్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డితో సర్వే కొనసాగుతుందన్నారు.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపునకు సర్వే చేశారు. స్థానిక భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఏపీ సమగ్ర శిక్ష ఉపాధ్యాయులు సురేష్, సాయిశిరీష తదితరులు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించారు.

ఉపాధి పనుల పరిశీలన

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లి, వెంకటాంపల్లి పెద్దతండా, వెంకటాంపల్లి చిన్న తండా తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఏపీఓ లక్ష్మీకాంతబాయి పరిశీలించారు. కూలీలతో ఆమె మాట్లాడారు. అనంతరం మస్టర్‌ను పరిశీలించి, కూలీల సంతకాలను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి ఎంతమేర కూలి డబ్బులు పడతాయో అడిగి తెలుసుకున్నారు. కూలీలు రోజూ ఉదయం 6 గంటల నుంచి 10:30 గంటల వరకు పని చేయాల్సి ఉంటుందన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్‌కు పరామర్శ



జయం ఫణిని పరామర్శిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణిని వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఉమాతో పాటు పార్టీ నాయకులు తలారి సత్తి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండుముఖం పట్టిన పంటలు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల పంచాయతీలో బోరుబావుల కింద సాగుచేసిన టమాటా, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు 10 ట్రాన్స్‌ఫార్మర్లు కింద పడిపోవడంతో పాటు 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. స్థానిక ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్ల నేటికీ మరమ్మతులు చేయక పోవడంతో మరోవైపు విద్యుత్ లేక గ్రామాల్లో అంధకారంలో మగ్గుతున్నట్లు ప్రజలు చెప్తున్నారు.

పశుబీమాతో పాడి రైతులకు ధీమా

- బీమా మొత్తంలో ప్రభుత్వ వాటా 80 శాతం, రైతు వాటా 20 శాతం
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న పశు సంవర్ధకశాఖ



పశు బీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్

ఉరవకొండ: వైఎస్సార్ పశుబీమా పథకం ద్వారా ప్రభుత్వం పశుపోషకులకు అండగా నిలుస్తోంది. బీమా మొత్తంలో రైతులు కేవలం 20 శాతం చెల్లిస్తే చాలు.. మిగిలిన 80 శాతం ప్రభుత్వమే భరిస్తుంది. ఈపథకం కింద దేశవాళీ, సంకరజాతి ఆడ, మగ పశువు మృతి చెందితే రూ.30 వేలు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు, గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేలు వర్తిస్తుంది. ప్రభుత్వం నిర్ణీత బీమా మొత్తం కన్నా ఎక్కవ మొత్తానికి బీమా చేయించుకోవాలంటే గేదెలు, ఆవుల్లో గరిష్టంగా రూ.1.20 లక్షలు, గొర్రెలు, మేకలు, పందుల్లో రూ.15 వేలు వరకు బీమా వర్తించనుంది. ఒక వేళ పశువును రైతు వేరే రైతుకు అమ్మినా ఆ వివరాలు ఏడు రోజుల్లోపు తెలియచేస్తే , పాలసీని కొత్త యజమాని పేరిట వర్తింపజేస్తారు. బీమా పరిహారానికి ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలి.

ప్రీమియం చెల్లింపు ఇలా:

దేశీయ, సంకరజాతి ఆవులకు ప్రీమియం మొత్తం రూ. 30 వేలకు గాను ఎస్సీ, ఎస్టీలతో పాటు తెల్లరేషన్‌కార్డు కలిగిన వ్యక్తులు 3 సంవత్సరాలకు గాను రూ.384, మిగిలిన రైతులు రూ.960 చెల్లించాలి. నాటుజాతి ఆవులు, గెదేలకు ప్రీమియం మొత్తం రూ.15 వేలకు గానూ ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్‌కార్డు కలిగిన రైతులకు రూ.192, మిగిలిని రైతులకు రూ.480, గొర్రెలు, మేకలు, పందులకు ఏడాదికి ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారికి రూ.36, ఇతరులకు రూ.90 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

రైతు భరోసా కేంద్రాల్లో నమోదు..

పశుబీమా సదుపాయం కోసం రైతులు తమ సమీపంలో ఉన్న పశు వైద్యశాలలు, రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తమ పశువుల వివరాలను నమోదు చేయించి రైతు వాటా ప్రీమియంను ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏడాదిలో ఒక రైతు గరిష్టంగా ఐదు పశువులకు, గొర్రెలు, మేకలు, పందులు అయితే 50 జీవాలకు మాత్రమే బీమా అర్హత ఉంటుంది. 2 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగి ఒక్కసారైన ఈనిన గేదెలు, ఆవులకు అన్ని వయసుల మగ పశువులకు 6 నెలల వయస్సు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు బీమా పథకం వర్తిస్తుంది.

21 రోజుల్లోపు పరిహారం



పశువులకు మూడేళ్ల పాటు గొర్రెలు, మేకలు, పందులకు ఒకటి నుండి రెండేళ్ల పాటు బీమా పథకం వర్తిస్తుంది. కాలయాపన లేకుండా పశువు మరణించిన 21 రోజుల్లోనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి బీమా మొత్తం జమ అవుతుంది. పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు ఉపయోగించుకోవాలి. పశువు విలువను బట్టి బీమా మొత్తం ఉంటుంది. ఆర్‌బీకేల్లో ఉండే సిబ్బంది, గోపాలమిత్రల ద్వారా పాడి రైతులు అవసరమైన సేవలు పొందాలి.

– డాక్టర్ జి.వెంకటేష్, డిప్యూటీ డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ, ఉరవకొండ

ఆధునిక పద్ధతులతోనే అధిక దిగుబడి



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ మద్దిలేటి

రాయదుర్గం రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడి సాధించొచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి తెలియజేశారు. గురువారం మండలంలోని 74 ఉడేగోళం రైతు భరోసా కేంద్రంలో ఏఓ మహేంద్ర ఆధ్వర్యంలో సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజా కుమారితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2024 ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న సందర్భంగా పలు రకాల పంటలపై యాజమాన్య పద్ధతులపై ఆయన రైతులకు వివరించారు. వ్యవసాయ తోటల్లో ఇప్పటికే సాగు చేసిన పంటలను ఆశించిన మొదళ్ల కుళ్లు, కాండం కుళ్లు , మొవ్వకుళ్లు తదితర చీడపీడ బెడదలపై వివరించారు. వర్షాధారంతో మెట్ట భూమిలో సాగు చేసే వేరుశనగ సాగులో ఎదురయ్యే చీడపీడలపై క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏఈఓ ప్రసాద్ , ఎంపీఈఓ సత్యవతి, ఆర్బీకే సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

టేబుల్‌కు ఒక ఏజెంట్ నియమించుకోండి

- రాజకీయ పార్టీల సమావేశంలో ఆర్‌ఓ కేతన్‌గార్గ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆర్‌ఓ కేతన్‌గార్గ్

ఉరవకొండ: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ తరపున ఓట్ల లెక్కింపు సమయంలో ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంట్‌ను నియమించుకోవచ్చని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీ నేతలతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఉరవకొండ నియోకవర్గ ఫలితం ముందు ప్రకటించే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో 263 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,24,339 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో 1,92,441 మంది (86.78) శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. లెక్కింపు పక్రియలో అత్యధికంగా 18 టేబుళ్ల, 15 రౌండ్లలో ఫలితం తేలనుందన్నారు. మెదట పోస్టల్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, తర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2గంటల లోపు ఉరవకొండ ఫలితం తేలనుందన్నారు. కార్యక్రమంలో ఈఏఆర్‌ఓ శిరీష, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోండి

- డీఎల్‌పీఓ సుమన జయంతి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సుమనజయంతి

కూడేరు: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని డివిజన్ లెవల్ పంచాయతీ ఆఫీసర్ (డీఎల్‌పీఓ) సుమన జయంతి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను వసూలు చేయడంలో అలసత్వం చేయొద్దన్నారు. వంద శాతం పూర్తి కావాలని ఆదేశించారు. తాగు నీటి సమస్య ఎక్కడైనా తలెత్తితే వెంటనే స్పందించి ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. రోడ్లపై, ఇళ్ల దగ్గర మురుగు, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. లేదంటే దోమలు ప్రబలి ప్రజలు వ్యాధుల బారినపడాల్సి వస్తుందన్నారు. 2023కి సంబంధించి ఇంటి పన్నుల రిజిష్టర్లను పంచాయతీల వారీగా పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫారంపాండ్లతో భూగర్భ జలాల పెంపు



అంతరగంగలో ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న ఏపీఓ తులసీ ప్రసాద్

కూడేరు: ఫారంపాండ్లతో భూగర్భ జలాలు పెరుగుతాయని ఏపీఓ తులసీ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని ఇప్పేరు, అంతరగంగ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న ఫారంపాండ్లు, చెక్ డ్యాంల్లో పూడిక తీత పనులను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు పనులను నాణ్యతగా చేపడితే దిన కూలి రూ.300 వర్తిస్తుందని, ఆయన కూలీలకు తెలియజేశారు. అనంతరం రైతులతో కలిసి మాట్లాడారు. ఫారంపాండ్లను తమ పొలాల్లో తవ్వించుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. వర్షం నీరు ఫారంపాండ్లలో నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి లభ్యత పెరుగుతుందని ఏపీఓ రైతులకు సూచించారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్రిస్వామికి ఆయన సూచించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న బెళుగుప్ప ఎస్‌ఐ శివ

బెళుగుప్ప: ఎన్నికల ఫలితాల సమయంలో అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ శివ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో కాలువపల్లి, బెళుగుప్ప, దుద్దేకుంట, గుండ్లపల్లి గ్రామాల్లో పికిటింగ్ స్పెషల్ టీం ఉంటుందన్నారు. నాలుగు రూట్లలో మూడు మొబైల్ టీంలు ఉంటాయన్నారు. జూన్ 10 వరకు గ్రామాల్లో నైట్ పెట్రోలింగ్ కొనసాగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 336 బైండోవర్ కేసులతో పాటు సస్పెక్ట్, రౌడీషీటర్లపై 44 కేసులు నమోదు అయ్యాయన్నారు. బైండోవర్ కేసుల్లో ఉండి, అల్లర్లకు పాల్పడితే నాన్‌బెయిలబుల్ కేసులతో పా టు రూ.లక్ష జరిమానా, ఆరు నెలల జైలు పడుతుందన్నారు.


చిన్నంపల్లిలో కార్డన్ సెర్చ్

శెట్టూరు: సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గురువారం మండలంలోని చిన్నంపల్లిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ హరినాథ్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లు, పాతనేరస్తులు ఇళ్లలో సోదా చేశారు. అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పరశురాములు, వెంకటస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వజ్రకరూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని వెంకటాంపల్లిపెద్దతండా, జరుట్లరాంపురం తదితర గ్రామాల్లో కేంద్రసాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి ఎస్‌ఐ నరేష్ కవాతు నిర్వహించారు.

ఘనంగా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో యల్లమ్మ దేవత

అనంతపురం కల్చరల్: నగరంలోని పాతూరు బంగారు అంగళ్ల వీధిలో వెలసిన బంగారు యల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర బాబు నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక అలంకార సేవలు నిర్వహించారు. విశేష పూజోత్సవాలు చేపట్టారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన పూజలను అర్చకుడు సర్వేశ్వరాచారి సంప్రదాయరీతిలో జరిపించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. సాయంత్రం వరకు భక్తజనం బారులు తీరి అమ్మవారి తీర్థప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన జరిగంది. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఆలయం దినదినాభివృద్ధి జరుగుతుండడం సంతోషకరమన్నారు. ఈ ఏడాది 8వ వార్షికోత్సవ వేడుకలను అందరూ కలసి నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కిశోర్‌కుమార్, చంద్రశేఖరగుప్తా, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

కూడేరు: మండల పరిధిలోని కొర్రకోడులో గురువారం బోయ ధనుంజయ్య అనే రైతు మోటార్ వద్ద మరమ్మతులు చేస్తుండగా, విద్యుత్ షాక్ గురై తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

జూన్ 2న వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

అనంతపురం రూరల్: పది, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులకు జూన్ 2న ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వాల్మీకి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు అక్కులప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. రుద్రంపేట బైపాస్ పరిధిలోని వాల్మీకి కళ్యాణ మండపంలో కార్యక్రమం ఉంటుందన్నారు. పురస్కారాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440774519, 8309090406 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జూన్ 15 నుంచి వేరుశనగ విత్తుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ శైలజ

కూడేరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్ 15 నుంచి జూలై 15లోపు వేరుశనగను విత్తుకోవాలని ఏఈఓ శైలజ రైతులకు తెలియజేశారు. గురువారం విత్తన వేరుశనగ కోసం రైతులు ఏఓ కార్యాలయానికి అధికంగా వచ్చారు. ఈ సందర్భంగా ఏఈఓ వేరుశనగ విత్తన సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ముందస్తుగా విత్తన సాగు చేస్తే పంట కోత దశలో వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా పంట దెబ్బ తినడం, విత్తనాలు మొలకెత్తుతాయన్నారు. అదునులో విత్తనం విత్తితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా వేరుశనగ సాగు విస్తీర్ణం 30 వేల ఎకరాలు అన్నారు. గత ఏడాది వర్షాభావంతో కేవలం 5 వేల ఎకరాల్లోనే వేరుశనగ సాగు చేశారన్నారు. ఈ ఏడాది వర్షాలు ముందస్తుగా కురుస్తుండడంతో వేరుశగన సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు.

ముగిసిన అక్క దేవతల ఉత్సవాలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్క దేవతల ఉత్సవాలు ముగిశాయి. గత వారం రోజులుగా అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను ప్రజలు నిర్వహించారు. గురువారం ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కుంకాలు ఆడుతూ ఆనందంగా గడిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

జెడ్పీ ఆవరణలో ఉద్రిక్తత

అనంతపురం సిటీ: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కొందరు వ్యక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈలలు, కేకలు, బండబూతులు తిట్టుకుంటూ హంగామా చేశారు. అందరూ ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారు. జెడ్పీ కాంపౌండ్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు ఏం జరుగుతోందో అర్థం కాక ఆందోళనకు గురయ్యారు. అయితే ఓ జెడ్పీ ఉద్యోగి జోక్యం చేసుకొని ×ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో వారంతా అక్కడి నుంచి జారుకున్నారు. అయితే వారు ఎవరు? ఎందుకు కొట్టుకున్నారనే వివరాలు తెలియరాలేదు. పోలింగ్ సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇటువంటి గొడవలకు ఆస్కారం లేకుండా జెడ్పీ, పోలీస్ అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్మాస్ హుసేనీస్వామి దర్గాలో పాతేహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణంలో కందూరీలు చేశారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓగా బాధ్యతలు చేపడుతున్న జీవీ సుబ్బరాజు

ఉరవకొండ: నూతన ఎంపీడీఓగా జీవి సుబ్బరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న అమృత్‌రాజ్‌ను బాధ్యతల నుంచి తొలగించడంతో బెళుగుప్ప మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న జీవీ సుబ్బరాజుకు ఎఫ్ఏసీ బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారు.

వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించండి

బెళుగుప్ప: జీవాలకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని పశువైద్య అధికారి రమేష్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బెళుగుప్ప సమీపంలో గొర్రెలకాపరి కెంచరాముడుకు చెందిన మందను పరిశీలించారు. అందులో ఒక గొర్రె పొట్ట జలగ, చిటుక వ్యాధితో మృతిచెందిందని తేల్చారు. అనంతరం నీరసంగా ఉన్న గొర్రెలకు టానిక్‌లు వేశారు.

కర్ణాటక మద్యాన్ని పట్టుకున్న సెబ్ అధికారులు

కూడేరు: మండల కేంద్రంలో కర్ణాటక మద్యాన్ని గురువారం పట్టుకున్నారు. తోపుదుర్తికి చెందిన ఓబుళమూర్తి, కొడిమికి చెందిన ఈడిగ అఖిలేష్ బళ్లారి నుంచి ఐచర్ వాహనంలో 15 బాక్సుల కర్ణాటక మద్యాన్ని అనంతపురం వైపు తీసుకెళ్తుండగా అనంతపురం సెబ్ సీఐ యల్లయ్య సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. అక్రమ మద్యం విలువ సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందని సీఐ యల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ సరస్వతీ, ఇంటెలిజెన్స్ ఎస్‌ఐ శ్రీలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యంలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. మూడు ద్విచక్రవాహనాలు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. మరోవైపు మండలంలోని 12 మంది పాత నేరస్తులపై రౌడీషీట్లు ఓపెన్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.